

వరంగల్ ఉర్సు గుట్ట మైదానంలో దహనమవుతున్న నరకాసుర ప్రతిమ

వెలుగుల పండుగకు వేళాయే..

దీపావళికి ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్తాబు

- ఉదయం మంగళహారతులు
- సాయంత్రం ధనలక్ష్మి పూజలు
- రేపు శ్రీగౌరీ కేదారీశ్వర వ్రతాలు
- పూజా సామానులు, పూల అమ్మకాలతో సందడే సందడి





హనుమకొండలో పూలను కొనుగోలు చేస్తున్న మహిళలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్/జనగామ కల్చరల్, మహబూబాబాద్/ములుగు/భూపాలపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి.. అన్నట్లుగా.. నరకాసురుడిని వధించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సత్యభామ శౌర్యం.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రతీ ఏటా ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకునే దీపావళి పర్వాన్ని గురువారం జరుపుకునేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలంతా సమయాత్తమయ్యారు. తెల్లవారుజామునే లేసి అభ్యంగన స్నానాలు ఆచరించి ప్రతీ ఇంటా గురువారం తెల్లవారుజామునే మంగళహారతులను అందుకొని ఇష్టదైవాన్ని పూజించుకోవడం ఆచారంగా వస్తోంది. ప్రతీ ఇంటా మామిడి తోరణాలతో, బంతిపూల దండలతో సర్వాంగ సుందరంగా అలంకరింప చేసుకున్నారు. రాత్రివేళల్లో బాణా సంచా కాల్చేందుకు ఆబాల గోపాలం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా శుక్రవారం ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు మంగళహారతులు నిర్వహిస్తారు. ఆడబిడ్డలతో హారతులు తీసుకుంటారు. సాయంత్రం శ్రీధనలక్ష్మీ అమ్మవారి పూజలను నిర్వహిస్తారు. దీపావళి సందర్భంగా పూలు, పండ్లు, మిఠాయిల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. పండుగ పర్వదినం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఈసారి గురువారమే మంగళహారతులతోపాటు అమావాస్య స్వాతినక్షత్రం ఉన్నందున రాత్రి మహాలక్ష్మి వ్రతాలను ఆచరించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయం

శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా వెళ్లి నరకాసురుడిని సంహరించిన నేపథ్యంలో చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పర్వం ఆనందోత్సవాలతో జరుపుకోవడం ఒక ఆచారం, కాగా, శ్రీరామచంద్రుడు రావణుడిని సంహరించాక సీతాసమేతుడై రాజ్యాభిశక్తుడై అయోధ్య నగరానికి తరలివచ్చిన వేళ ఇదే స్వాతినక్షత్రం దీపావళి రోజు కావడంతో ప్రతీ ఇంటా ఆ రఘురాముడిని ప్రార్థిస్తూ ఉల్లాసంగా ఈపర్వాన్ని జరుపుకోవడం సంప్రదాయం. కుటుంబ సమేతంగా ప్రతీ ఒక్కరు ఐక్యమై ఆచరించుకునే హిందూ సంస్కృతిలోని ముఖ్యమైన పర్వాల్లో ఈ పర్వానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా భక్తి శ్రద్ధలతో శ్రీకేదారేశ్వర వ్రతాలను ఆచరించుకోవడం ఈ పర్వానికే చెల్లింది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి హనుమకొండ చౌరస్తాతో పాటు ఇతర ముఖ్య కూడళ్లల్లో దీపావళి పర్వ సామాగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించింది. అమావాస్య రోజు చీకట్లను పారదోలి ఇంటింటా లక్ష్మీ దీపాలను నువ్వుల నూనెతో వెలిగించి పౌర్ణమి వెలుగులను సృష్టింప చేయడమే ఈ పర్వం ప్రత్యేకత.

రేపు వ్రతాలు

స్వాతినక్షత్రం అమావాస్య సందర్భంగా శ్రీగౌరీ కేదారీశ్వరస్వామి వ్రతాలను శుక్రవారం ఇంటింటా లక్ష్మీ నోములను ఆచరించుకోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పడిపోయిన నోములు, కొత్త నోములు, ప్రతీ ఏడాది ఆచరించుకునే నోములను ఈ సంవత్సరం నిర్వహించుకోవచ్చని పండితులు చెప్పారు. దీపావళి నోముల సందర్భంగా తమ గృహాలకు సున్నాలు, కలర్లు వేసుకొని దీపావళి నోములను ఆచరించడానికి సిద్ధం చేస్తున్నారు.

పూజా సామగ్రి

శ్రీకేదారీశ్వర వ్రతానికి మామిడాకులు, బంతి పూల మాలలు, మర్రి కట్టెలు, మర్రి ఆకులు, మర్రి ఊడలు, వాగు ఇసుక, వరి గొలుసులు, మర్రి పండ్లు, కొత్త చాట, కొత్తకుండ కలశం కోసం, పసుపు, కుంకుమ, అక్షింతలు, ఊదులోబాన్, జామపండ్లు, సీతాఫలాలు, కొత్తకుడుకలు, కర్జూరపండ్లు, పోకలు, బెల్లం బూరెలు, అరిశలు, కొబ్బరి కాయలు, అగర్‌వొత్తులు, కర్పూరం బిల్లలు, నువ్వుల నూనె, అత్తిపుత్తిదారం, మంగళ తోరణాలు, బెల్లం పాయసం పూజలకు అవసరమవుతాయి. నోముల సందర్భంగా వ్రత కల్పాన్ని చదువుతారు. మరునాడు నోములను ఎత్తుకొని నైవేద్యాలను స్వీకరించి అత్తిపుత్తిదారాన్ని రక్షగా కట్టుకుంటారు.

నేడు దత్త క్షేత్రంలో మహాలక్ష్మికి ధనలక్ష్మి పూజ

దీపావళి పర్వదినం సందర్భంగా ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వర దత్తక్షేత్రంలో గురువారం సాయంత్రం శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజ, కొత్త నాణెములతో ధనార్చన, విశేష కుంకుమ పూజ, పారాయణాలు, భజనలు, మహా మంగళహారతులు, కాగడ హారతులు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదం అందిస్తారని శ్రీదత్తక్షేత్రం ట్రస్టు సభ్యులు వైపీ వామన్‌రావు తెలిపారు.

కళ్లు చెదిరేలా..

ఘనంగా నరకాసురుడి ప్రతిమ దహనం

- ఉర్సు గుట్ట వద్ద ఉత్సాహంగా వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- అలరించిన ప్రత్యేక బాణసంచా విన్యాసాలు

కరీమాబాద్, అక్టోబరు30, (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో బుధవారం నరకాసుర వధ కన్నుల పండువగా సాగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఆద్యంతం వైభవంగా కొనసాగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, భద్రకాళి దేవాలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాల ని, పండుగల విశిష్టతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయ మని అన్నారు. సనాతన ధర్మం అనేది విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేస్తుందని, భగవంతుడు ధర్మాన్ని రక్షించేందుకు అవతరిస్తాడని అన్నారు. మన లోని దుర్గుణాలను త్యజించినప్పుడే మన జీవితంలో నిజమైన వెలుగు వస్తుంద ని, ఆనాడు నరకాసురుడు సృష్టించిన అల్లకల్లోలాన్ని శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి రాక్షస సంహారం చేయడంతో ప్రజలు సంతోషంతో దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారని గుర్తు చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడటంలో ఎన్ని అవరోధా లు అడ్డు వచ్చినా తుదకు ధర్మానిదే విజయమని అన్నారు. సనాతన ధర్మాన్ని కా పాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. స్వాతంత్రోద్యమంలో నాయకత్వం వహిం చిన గాంధీ ధర్మబద్ధమైన మార్గాన్ని ఎంచుకున్నాడని అన్నారు. ప్రజలకు సంతోషా లు కలగాలన్నా, సర్వమానవ సౌభ్రాతృత్యం లభించాలన్నా ధర్మమార్గాన్ని అనుస రించాలని అన్నారు. ప్రతీ వ్యక్తి అష్టాంగ యోగాన్ని అచరించాలని, అందులో ఉన్నటువంటి యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి వీటిని అనుసరిస్తే మనలోని బద్ధకాన్ని త్యజిస్తే లోకకల్యాణం సిద్ధిస్తుందన్నారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి రిమోట్‌తో నరకాసుర వధను ప్రారంభించారు.అంతకు ముందు వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణ సత్యభామ వేషధారణలో కళాకారులను ఊరేగింపుగా వేదికకు తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఉర్సు గుట్ట మైదానం కిక్కిరిసిపోయింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నరకాసుధ వధ ఘట్టం, ప్రత్యేక బాణసంచా వెలుగులు ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. వేడుకల నిర్వహణకు సహకరించిన దాతలను ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ, నరకాసుర వధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన పత్తి



ఏనుమాముల మార్కెట్లో అకాల వర్షానికి తడిసిన పత్తి బస్తాలు

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బుధవారం కురిసిన అకాల వర్షానికి పత్తి బస్తాలు తడిసిపోయాయి. వెంటనే స్పందించిన మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల యార్డు ఇన్‌చార్జితో మాట్లాడి పత్తి బస్తాలు తడువకుండా తాటిపత్రులను కప్పించారు. అప్పటికే కొన్ని పత్తి బస్తాలు తడిసిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖరీదుదారులు తడిసిన బస్తాల కొనుగోలు సమయంలో బస్తాకు కిలో చొప్పున తరుగు తీసివేసి కొనుగోలు చేశారు. పత్తి మార్కెట్లో గరిష్ట ధర క్వింటాకు రూ. 6960లు పలుకగా కనిష్ట ధర రూ.5000 పలికింది.

పిడుగుపాటుతో యువ రైతు మృతి

- తల్లికి తీవ్ర గాయాలు
- కాల్‌నాయక్‌తండాలో విషాదం

చెన్నారావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో పత్తి ఏరేందుకు కూలీకి వెళ్లిన ఓ యువ రైతు పిడుగుపాటుకు మృతిచెందాడు. అమె పక్కన నడుస్తున్న తల్లికి తీవ్రగాయాలయ్యాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కాల్‌నాయక్ తండాలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాదం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాల్‌నాయక్ తండాకు చెందిన రైతు కొర్ర నాగరాజు (28) తనకున్న ఎకరంన్నర చెలుకతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధవారం తన చెలుక వద్ద పనిలేకపోవటంతో బానోతు నర్సింహ అనే రైతుకు పత్తి చేనులో పత్తి తీయడానికి కూ లీ పనులకు వెళ్లాడు. 20మంది కూలీలు పత్తి తీసే పనులు చేస్తుండగా మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. ఈ క్రమంలో కూలీలందరూ వర్షంలో ఇంటికి వస్తున్న క్రమంలో కొర్ర నాగరాజు వద్ద పిడుగు పడడంతో కిందపడిపోయాడు. పక్కనే వస్తున్న నాగరాజు తల్లి షాంకీ చేయికి తీవ్ర గాయాలయ్యాయి. కొంచెం దూరంలో ఉన్న కూలీలు వారి వద్దకు చేరుకొని నాగరాజును నర్సంపేట ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. యువ రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





నాగరాజు మృత దేహంపై పడి రోదిస్తున్న బంధువులు

మూగజీవాలపై పిడుగు

కురవి(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం శివారు జుజుర్‌తండాలో పిడుగుపాటుకు రెండు దుక్కిటెద్దులు మృతి చెందాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంలో పిడుగు పడడంతో పత్తిచేనులో ఉన్న హేమసుందర్‌కు చెందిన దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. పొద్దంతా ఎరిన పత్తిని రైతు దంపతులు ఇంటికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా భారీ శబ్దంతో పిడుగుపడి ఎద్దులు మృతి చెందాయి. కొద్దిదూరంలోనే ఉన్న రైతు దంపతులు ప్రాణాలతో బయటపడ్డారు. అదే విధంగా కురవి మండలం మొగిలిచర్లలో పిడుగు పడడంతో చేనులో మేత మేస్తున్న ఇరుకులపాటి నర్సయ్యకు చెందిన పాడిగేదే అక్కడికక్కడే మృతి చెందింది.

పత్తిపాక రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి

● ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మహబూబాబాద్‌లో పత్తిపాక రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. పట్టణంలో నత్తనడకన నడుస్తున్న పత్తిపాక రోడ్డును బుధవారం సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపాక రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ రోడ్డును తవ్వి వదిలేయడంతో ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దానిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి సర్వే సమీక్షా సమావేశానికి హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోను కలిసి సమస్యను వివరించారు. పత్తిపాక రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ తాను రోడ్డును సందర్శించి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రవీణ్, కౌన్సిలర్లు గుండా రాజశేఖర్, ఎడ్ల వేణు, మార్నేని రఘు, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

రఘునాథపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు పక్కాగా నమోదు చేయాలని ఏఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ అల్ఫాన్సెస్, సెయింట్ మేరీ ప్రైవేటు పాఠశాలలతో పాటు మండలంలోని వెల్ది మోడల్ స్కూల్, సరస్వతి శిశుమందిర్, జాఫరగూడెం, ఖిలాషాపూర్ పాఠశాలలను ఏఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో యూడైస్ ప్లస్, అపార్ ద్వారా విద్యార్థుల వివరాలు, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. అపార్ ద్వారా విద్యార్థులకు 12 అంకెలు గల గుర్తింపు నెంబర్ వస్తుందని, దీని ద్వారా విద్యార్థుల పూర్తి స్థాయి విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ సమ్మయ్య, సీఆర్‌పీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్



పోలీసుల కిట్లను తనిఖీ చేస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. బుధవారం ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించగా సీఐ జి.వేణు పుష్పగుచ్ఛం అందించి గౌరవ వందనం చేశారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది కిట్‌బాక్స్‌లను పరిశీలించారు. కిట్ బాక్స్‌లో ఉన్న పరికరాల గురించి సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం పలువురు పీసీలను కిట్ బాక్స్‌లో పరికరాలను కూర్పు చేయాలని సూచించగా కొందరు తడబడడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ కానిస్టేబుల్ సర్వీసు బుక్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతీ కానిస్టేబుల్ విధిగా అన్ని రకాల నిబంధనలు పాటించాలన్నారు. లాఠీలు ఉన్నప్పటికీ సిబ్బంది ఎందుకు బయటకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డు గదులను, ఎస్సై, సీఐల చాంబర్‌లను, కంప్యూటర్ గది, సెల్‌లను, వివిధ కేసుల్లో పట్టుకున్న బైక్‌లను, వాహనాలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యను తెలుసుకోవాలన్నారు. పెట్రోలింగ్ చేసే సిబ్బంది విధులను మొక్కుబడిగా కాకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, తద్వారా దొంగలు సంచరించడానికి భయపడుతారని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమాశర్మ, ఎస్సైలు వినయ్‌కుమార్, రమేష్ సిబ్బంది జి.కుమార్, శ్రీనివాస్, నరేష్, రాఘవేందర్, మల్లేశం, రజాక్, మగ్దుం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఉద్యమించాలి

తాడ్వాయి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలు స్వయంపాలన, హక్కుల కోసం ఉద్యమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ పోరాట యోధుడు కుమరంభీం 84వ వర్ధంతిని పురస్కరించుకుని నాయకులు డోలువాయిద్యాల నడుమ మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కుమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏజెన్సీలోని ఆదివాసీ నిరుద్యోగ యువత అభివృద్ధి చెందాలంటే ఐటీడీఏను బలోపేతం చేస్తూ 29శాఖల్లో నూరుశాతం రిజర్వేషన్ అమలుకు ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం అమలుతోపాటు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా డిసెంబరు 9న మేడారంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఆదివాసీలతో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పొడెం బాబు, రేగ నరేంద్రకుమార్, పులిసె బాలకృష్ణ, కొప్పుల రవి, కొర్నిబెల్లి గణేష్, సిద్దబోయిన స్వామి, ఇరుప సునీల్, మోకాళ్ల వెంకటేష్, రేగ కళ్యాణి, కల్తి సుగుణ, కోరగట్ల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఐలాపూర్‌లో వర్ధంతి సభ

కన్నాయిగూడెం : కుమరంభీం వర్ధంతిని సభను మండలంలోని ఐలాపూర్‌లో ఆదివాసీలు నిర్వహించారు. కుమరంభీం చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు , మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఆలం నగేష్ వెంకటేశ్, కోడె సుధాకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై డీలర్లు అవగాహన కలిగి ఉండాలి

● దేశి శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తేజోవతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి తేజోవతి

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై డీలర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధికారి సి.హెచ్.తేజోవతి అన్నారు. ములుగులోని రైతువేదికలో బుధ వారం దేశి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా తేజోవతి మాట్లాడుతూ జిల్లాలోని 80మంది డీలర్లకు 40వారాలపాటు శిక్షణ ఉంటుందని, దేశి శిక్షణ పొందిన డీలర్లు తమ వద్దకు వచ్చిన రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనా లు, పురుగు మందులు సరఫరా చేయాలన్నారు. రైతులకు పంటలపై అవగా హన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, ములుగు ఏడీఏ సురేష్‌కుమార్, ఏటూరునాగారం ఏడీఏ చేరాలు, దేశి ఫెసి లిటేటర్ బి.స్వామి, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

జనగామ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం తడిసి ముద్దయింది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో పలు ప్రాంతాల నుంచి రైతులు ధాన్యం అమ్మకానికి తెచ్చారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా అకాల వర్షం పడడంతో ఆరబోసిన ధాన్యం తడిసింది. రైతు సంఘం నాయకులు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తే నష్టపోకుండా రైతులను ఆదుకోవచ్చన్నారు.



వర్షానికి మార్కెట్‌లో తడిసిన ధాన్యం రాసులు

పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ములుగులోని జిల్లాపరిషత్ కాన్ఫరెన్స్‌హాల్‌లో పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనం బుధ వారం జరిగింది. ముఖ్య అతిథిగా పీఆర్టీయూ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నూతన ఉపాధ్యాయ నియామకాలు పారదర్శకంగా జరిగాయని అన్నారు. ఉపాధ్యాయులు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు కదలాలని అన్నారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా కొయ్యడ సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోరిక రామన్ననాయక్, ఆర్థిక కార్యదర్శిగా ఇర్సవడ్ల జగన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా జనగాం బాబూరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంకిడి రవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రౌతు రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వ్యవస్థాపకులు హర్షవర్ధన్‌రెడ్డి

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

బచ్చన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టబోయే ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి రామారావు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, అంగన్‌వాడీ టీచర్లు, వీఏవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. ప్రతీ ఇంటికి వెళ్లి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ఫార్మాట్‌ను వివరించారు. ప్రత్యేక శిక్షణ పొందిన వారితో సమావేశంలో పాల్గొన్న వారికి శిక్షణ ఇప్పించారు. సమావేశంలో ఎంపీడీవో మల్లికార్జున్, ఎంఈవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో రామారావు నాయక్

5న నర్సింహులు విగ్రహావిష్కరణ



పాలకుర్తిలో కరపత్రం ఆవిష్కరిస్తున్న బాధ్యులు

పాలకుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన పాలకుర్తిలో నవంబరు 5న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానికంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు మాచెర్ల సారయ్య, ఉపాధ్యక్షుడు పోగు శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబరు 5న నర్సింహులు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ ఆలిండియా కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, చెరిపల్లి సీతారాములు, మాజీ మంత్రి దయాకర్‌రావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు కుమార్తె చింతకింది అరుణ, కూరపాటి సుదర్శన్, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మీనారాయణ, దేవసాని కృపాకర్, మార్కండేయ, పెనుగొండ రమేష్, కాటబత్తిని రమేష్ పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు

● సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో పని చేయిస్తే చర్యలు తప్పవని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బుధవారం జనగామ బస్టాండ్ చిన్న గేటు వద్ద బాలురు పని చేస్తున్నారన్న పక్కా సమాచారంతో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, లేబర్ అధికారులు తనిఖీ చేసి బాలకార్మికులను పట్టుకొని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మరోసారి పిల్లలను పనికి పంపిస్తే చర్యలు తప్పవని తల్లిదండ్రులను హెచ్చరించారు. పిల్లలను బడికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో కె.రాము, సీడబ్ల్యూసీ ఉప్పలయ్య, లేబర్ ఆఫీసర్ కుమారస్వామి, డీసీపీవో రవికాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి

● మరో ఇద్దరికి గాయాలు
● జనగామ-సూర్యాపేట రహదారి చింతబావితండా వద్ద ఘటన



మల్లేష్ (ఫైల్)

దేవరుప్పుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనగామ-సూర్యాపేట రహదారిలోని చింతబావితండా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన ప్రకారం... మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన వీఆర్ఏలు పందినమైన మల్లేష్(45), పేరపు రామకృష్ణ, కామారెడ్డిగూడెంకు చెందిన టీసేవ నిర్వాహకుడు దౌపాటి అనిల్ కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దేవరుప్పులకు వస్తుండగా చింతబావితండా వద్దకు చేరుకోగానే సూర్యాపేట వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీఆర్ఏ మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వీఆర్ఏ రామకృష్ణ, టీసేవ నిర్వాహకుడు అనిల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి వచ్చి గాయపడిన ఇద్దరితో పాటు మల్లేష్ మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్‌కుమార్ వెల్లడించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా..

దేవరుప్పుల డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్‌రెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల కోసం జనగామకు వెళ్లిన మాదాపురం గ్రామ వీఆర్ఏ మల్లేష్(45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. విషయం తెలియగానే మల్లేష్, రామకృష్ణ కుటుంబీకులు, గ్రామస్థులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలివెళ్లారు. మల్లేష్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

తొర్రూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహ బూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని పోలేపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరా లు ఇలా ఉన్నాయి. పోలేపల్లి గ్రామానికి చెందిన పందుల వెంకటేశ్వర్లు (50) తనకు ఉన్న రెండుఎకరాల భూమిలో వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. భూమి కి నీటిసౌకర్యం లేకపోవడంతో ఇప్పటికే నాలు గు బోర్లు వేసినా నీరురాక పోవడం, దానికి తోడు కొనుగోలు చేసిన గొర్రెలు వ్యాధిసోకి మృతి చెందాయి. దీంతో రూ.9లక్షల 60వేలు అప్పు కావడంతో పాటు వాటికి వడ్డీలు పెరిగాయి. ఈ అప్పులను ఎలా తీర్చాలని మనో వేదనకు గురై మంగళవారం రాత్రి ఇంటో పురుగులమందు తాగి ఆత్మహత్యాయ త్నం చేశాడు. వెంటనే వెంకటేశ్వర్లును చికిత్స కోసం కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారులు వినోద్, విజయ్ ఉన్నారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు.

స్వీటు దుకాణంపై కేసు నమోదు

● కాలపరిమితి దాటిన జ్యూస్‌లను అమ్ముతున్న యాజమాని



మానుకోటలోని మిఠాయిపొట్లం స్వీటు షాపులో దాడులు చేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని పలు స్వీటు దుకాణాలపై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. మిఠాయిపొట్లం స్వీటు దుకాణంలో ఉన్న కాలపరిమితి ముగిసిన సీతాఫల్ జ్యూస్, ఇతర డ్రైఫ్రూట్స్, ఇతర ఫుడ్ ఐటమ్‌లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడుల్లో దొరికాయి. వీటి విలువ దాదాపు రూ.20 వేలు ఉంటుంది. పూర్తి నివేదికను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు గురువారం అందించనున్నట్లు, దానిపై జరిమానాలు విధించనున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి తెలిపారు. గత మూడ్రోజుల క్రితం ఓ వినియోగదారుడు జ్యూస్ తీసుకుని ఇంటికి వెళ్లగా ఆ జ్యూస్ తాగిన పిల్లలు అస్వస్థతకు గురికావడంతో ఆ వినియోగదారులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈ దాడులు నిర్వహించారు. అలాగే నారాయణ స్వీట్ హౌజ్‌లో సైతం దాడులు నిర్వహించారు. పలు స్వీటు రకాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

22 కిలోల గంజాయి పట్టివేత

● ఒడిషా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అరెస్టు



పాలకుర్తిలో గంజాయితో పట్టుబడిన నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి, అక్టోబరు 30 ఆంధ్రజ్యోతి): భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని పాలకుర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి సీఐ మహేందర్‌రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన సురేష్ ఫైడా అనే యువకుడు జల్సాలకు అలవాటుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంకు చెందిన సోడా రవి వద్ద 22 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. పాలిథిన్ కవర్‌లో వేసుకొని హైదరాబాద్‌కు పాలకుర్తి మీదుగా మోటార్ సైకిల్‌పై వెళుతున్నాడు. కస్తూర్బా గాంధీ పాఠశాల సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో అతడు తప్పించుకునే ప్రయత్నం చేయగా పట్టుకుని తనిఖీ చేసినట్లు చెప్పారు. 10 ప్యాకెట్లలో 22 కిలోల గంజాయి లభించింది. సురేష్ ఫైడాను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా హైదరాబాద్‌లో అమ్మేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పాడన్నారు. గత కొన్ని నెలల నుంచి ఈ దందా చేస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ మహేందర్‌రెడ్డి వివరించారు. మోటార్ సైకిల్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కాగా, గంజాయి విలువ రూ.5 లక్షలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
గురువారం 31 అక్టోబరు 2024 | 7





మార్కెట్లో స్వల్పంగా తడిచిన ధాన్యం

కేసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్న ధాన్యం తడిచింది. కొద్దిమంది రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు మార్కెట్ ఓపెన్‌యార్డులో పోసుకున్నారు. వర్షంతో టార్పాలిన్లు కప్పుకున్నప్పటికీ వరదనీరు ప్రవహించడంతో అడుగుభాగంలో సరుకు స్వల్పంగా తడిచింది.

నేటి నుంచి నాలుగు రోజులు సెలవులు

కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 31 నుంచి నవంబర్ 3 వరకు సెలవులు ఉన్నట్లు చైర్మన్ గంట సంజీవరెడ్డి బుధవారం ప్రకటించారు. ఈనెల 31న దీపావళి, నవంబర్ 1న అమావాస్య, 2, 3 తేదీల్లో శని, ఆది వారాంతపు సెలవులు ఉన్నాయని, రైతులు గమనించి తమ సరుకులను నవంబర్ 4న తీసుకురావాలని కోరారు.




ఊరికి వెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి

టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణ ప్రజలు దీపావళి పండుగ సందర్భంగా మీరు మీబంధువుల ఇండ్లకు వెళ్తున్నారా! అయితే తగు జాగ్రత్తలు తీసుకోవాలని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. శివారు కాలనీల్లో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళల్లో సంచరించినట్లుగా కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా కాలనీలో తిరుగుతున్న వారిని గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్లే సమయంలో ఖరీదైన వస్తువులను ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. కాలనీ, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవడం మంచిదన్నారు. ఊరికి వెళ్లే సమయంలో హడావుడిగా విలువైన వస్తువులు, అభరణాలు మరిచిపోకూడదని, తర్వాత బాధపడే కంటే ముందుగా జాగ్రత్త పడడం ఎంతో మంచిదని చెప్పారు.





తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్
ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు
8

సన్న, దొడ్డురకం వడ్ల కొనుగోళ్లకు వేర్వేరుగా సెంటర్లు

- రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలు
- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ







సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సన్న, దొడ్డురకం వడ్ల కొనుగోళ్లకు వేర్వేరుగా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ తెలిపారు. ఆయా కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని వివరించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 64, సహకార శాఖ -153, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ -11, ఇతరులు 06 మొత్తంగా 234 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు మాయిశ్చర్ వచ్చేంత వరకు చూసి కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలన్నారు. టార్పాలిన్స్ తయార్‌గా ఉంచుకోవాలని, కొనుగోలు చేసే ధాన్యాన్ని వెను వెంటనే తరలించాలని, జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యం తీసుకువచ్చే రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. సివిల్ సప్లయీస్, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, రెవెన్యూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రేమ్‌కుమార్, మధూసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, మరియన్న, మురళీ, విజయ్ కుమార్, సాయిచరణ్, మెప్మా పీడీ విజయ పాల్గొన్నారు.









'ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 14వ వార్డు పరిధిలోని రామచంద్రాపురం కాలనీలో సమగ్ర ఇంటింటి సర్వే మ్యాపింగ్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మానుకోట పట్టణంలో ఏ ఒక్క ఇల్లు కూడా మిస్ కాకుండా సర్వే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఆర్‌ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.





జిల్లా పోలీస్ కార్యాలయంలో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ చేస్తున్న పోలీస్ సిబ్బంది

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా సివిల్ పోలీసులు, ఆర్మ్డ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) పోలీస్ సిబ్బందితో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మాబ్ ఆపరేషన్‌లో భాగంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు పోలీస్ సిబ్బంది ఎలా స్పందించాలో ప్రదర్శన నిర్వహించారు. హింసాత్మక ఘటన జరిగితే గుంపును నియంత్రించడానికి పోలీసులు ఎలా మొదటి హెచ్చరిక చేస్తారో ప్రత్యక్షంగా చేసి చూపించారు. హెచ్చరికలు వినకపోతే వారు మెజిస్ట్రేట్ అనుమతితో భాష్పవాయువు ప్రయోగించి తమను తాము ఎలా రక్షించుకోవడానికి ఎలా లాఠీచార్జ్ చేస్తారో చూపించారు. అగ్నిమాపక శాఖ వాటర్ ఫిరంగిని ప్రయోగించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి గాలిలో పిచికారి చేసి చూపించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘీక శక్తులను అణిచివేసేందుకు ఇలాంటి మాక్ డ్రిల్ ఎంతో ఉపయోగపడతాయని సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు.









తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్

• ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలపై రూ.18,500 కోట్ల భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించగా, బీఆర్ఎస్ ప్రజాగొంతుకగా నిలిచి దానిని నిలువరించిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ప్రజలపై విద్యుత్ భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ విజయం సాధించడాన్ని హర్షిస్తూ మహబూబాబాద్‌లో ఆ పార్టీ ఆధ్వర్యం లో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడు విద్యుత్ చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపే ప్రతిపాదనను తీసుకువస్తే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ దానిని వ్యతిరేకించిందని చెప్పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బానోత్ రవికుమార్, కౌన్సిలర్లు ఎడ్ల వేణు, గుండా రాజశేఖర్, గోపి, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీను, చౌడవరపు రంగన్న, లూనావత్ అశోక్‌నాయక్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, షేక్. మహబూబ్‌పాషా, మార్నేని కిరణ్, అవుల వెంకన్న, మడత వెంకన్న, శ్రీను, ఆసిఫ్, పుచ్చకాయల రామకృష్ణ పాల్గొన్నారు.



మానుకోటలో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి, మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

● పెద్దవంగరలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాణ సంచాలు కాల్చి సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, సోమ నర్సింహారెడ్డి, శ్రీరాం సంజయ్, సుధీర్, వెంకన్న, హరీష్, దుంపల సమ్మయ్య, పటేల్, వెంకటయ్య, వెంకట్రామయ్య, భిక్షపతి, అనుదీప్, సతీష్, నవీన్ పాల్గొన్నారు.

● నెల్లికుదురులో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బాణసంచాలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, గుండ్ల వెంకన్న, పులి రామచంద్రు, సోమనర్సయ్య, బత్తిని అనిల్, ఆదిరెడ్డి, రహ్మాన్, విజయ్‌యాదవ్, మొగలగాని శ్రీను, అశ్విన్, భోజ్యానాయక్ పాల్గొన్నారు.

5న జరిగే చలో హైదరాబాద్‌కు రావాలి

నెహ్రూసెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 5న హైదరాబాద్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ లోని ఎమ్మార్పీఎస్ దండోరా జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సహాయనిధి కింద దళిత కుటుంబాలకు రూ.12 లక్షలను ఇస్తామని చెప్పి ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కుక్కల సుధారాణి, సీహెచ్.రాధ, సతీష్, రాజు, ప్రశాంత్, దేవేందర్, దేవి ఉపేందర్, చింటూ, భాగ్యరేఖ, సంధ్య, అరుణ, రాణి, జయ, రమ, వెంకటమ్మ పాల్గొన్నారు.

దివ్వెల పండుగకు ఘన చరిత్ర

• వ్రతాల వెలుగులు.. నోములు, పూజలు
• శివుడికి ఇష్టమైన కార్తీకమాసం ఆరంభం
• నవంబరు 1న సోదరి ఇంటా భోజనం

మహబూబాబాద్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందే పండుగల్లో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గవిభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్యదీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడవదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. మరో కథనంలో లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చేటప్పుడు కూడా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య దీపావళిని జరుపుకున్నారని కూడా చెప్పుకుంటారు. చీకటిని పారద్రోలుతూ.. వెలుగులు తెచ్చే పండుగనే కాకుండా విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని పెద్దలు చెబుతు న్నారు. దీపమాళికల శోభతో వెలుగొందే గృహంగణాలు ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే అబాలగోపాలం, నూతన వస్త్రాల రెప రెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణాసంచా పేలుళ్లు.. దీపావళి సోయగాలు ఈ పండుగ ప్రత్యేకతలు. ప్రతియేట ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందురోజు ఆశ్వయుజబహుళ చతుర్థశి దీన్ని నరక చతుర్థశిగా జరుపుకుంటారు.

వ్రతాలు, వెలుగులు..

దీపావళి రోజున ధనలక్ష్మీ వ్రతం, కేదారీశ్వరి వ్రతం, గౌరీ నోములు నోయడం తెలుగింటి సంప్రదాయ ఆచారంగా కొనసాగుతోంది. ఇళ్లు, ఆలయాల్లో వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి వెలుగులు నింపడం చెడుపై మంచి సాధించిన ఈ తిథిరోజు ఆకాశన్ని తాకేటట్టుగా దిక్కులు ప్రకాశవంతమైయ్యేలా బాణాసంచా కాల్చడం కొనసాగిస్తారు. దీపావళి అమావాస్య మొదలుకుని కార్తీకపౌర్ణమి పక్షం రోజులు వివిధ వ్రతాలు, నోములు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దిఫెస్టివల్ ఆఫ్‌లైఫ్‌గా దీపావళి వేడుకలను దేశమంతట ఘనంగా జరుపుకుంటారు. పిల్లలకు, పెద్దలకు దీపావళి పండుగ అంటే మహాసరదా, టపాసులు కాలుస్తూ ఆనందోత్సాహాలను జరుపుకుంటారు. కేదారీశ్వరి వ్రతం హిందువులు ఆచరించే ఉత్కృష్టమైన వ్రతంగా చెప్పుకుంటారు. ఈ రోజు ఇంటిల్లిపాది కఠోర ఉపవాసం ఉండి కేదారీశ్వరుని రూపంలోనూ శివుడిని ధ్యాని స్తారు.



ఈ నోము నోచుకున్న వారికి అష్టఐశ్వర్యాలకు, అన్నవస్త్రాలకు లోటు ఉండదని భక్తుల అపార విశ్వాసం. వ్రతం పూర్తి చేసిన అనంతరం నక్షత్ర దర్శనం చేసుకుని స్వామికి నివేదించిన వాటినే ప్రసాదంగా తీసుకుంటారు. ఈ వ్రతమహత్యం వలనే పార్వతిదేవి శివుని అర్థశరీరాన్ని పొందిందని పురాణాల్లో పేర్కొన్నారు.

శివుడిని స్తుతిసే..

భగవంతుడికి ఎక్కువ ప్రీతిపాత్రమైన మాసం కార్తీకమాసం. ఏటా దీపావళి వెళ్లిన మరుసటి రోజు నుంచి అతి పవిత్రమైన కార్తీకమాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో భక్తులంతా నిత్యం శివనామాన్ని స్మరిస్తూ ఉంటారు. ముఖ్యంగా కార్తీకమాసంలో వచ్చే సోమవారం నాడు భక్తులందరూ శివుడికి ప్రత్యేకమైన పూజలు చేస్తారు. సోమవారం సూర్యోదయంకు ముందే స్నానమాచరించి హరిహర శంభో అంటూ శివున్ని స్తుతిస్తే పాపాల నుంచి విముక్తి లభించడంతో పాటు అష్టఐశ్వర్యాలు కలుగుతాయని విశ్వసిస్తారు. సోమవారం ఉదయం స్నానాధికార్యక్రమాలను పూర్తి చేసుకుని, పొడిబట్టలు ధరించి మొదటగా దీపారాధన చేయాలి. అనంతరం శివుడికి రుద్రాభిషేకం చేయించి శివవ్రత నియమాలను పాటించాలి. ఇలా చేయడం ద్వారా సిరిసంపదలతో సుఖసౌఖ్యాలతో వర్ధిల్లుతారని నమ్మకం.

సోదరి ఇంటా భోజనం చేయాలి..

ఈ కార్తీకమాసంలో మొదటగా వచ్చేది యమవిదియ. దీనిని భగనీ హస్త భోజనం లేదా అన్నాచెల్లెళ్ల పండుగ అంటారు. ఈ పండుగ నవంబర్ 1న వస్తుంది. యమధర్మరాజు సోదరి యమునాదేవి ఒకరోజు అలక చెందగా యముడు ఆ సమయంలో ఆమెకు ఒక వరం ఇస్తాడు. యమ విదియ రోజున ఎవరు తన సోదరి ఇంట భోజనం చేస్తారో.. వారికి నరక బాధలు ఉండవని చెబుతారు. అందుకే ఈరోజు సోదరి ఇంట భోజనం చేసి వారి ఆశీస్సులు తీసుకోవాలని పెద్దలు చెబుతారు.

నాగుల చవితి, క్షీరాబ్ధి ద్వాదశి..

ఈ పండుగ మన మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో చేస్తారు. ఈ రోజు పుట్టలో పాలుపోసి నాగేంద్రుడికి పూజలు చేస్తారు. పూర్వం తక్షకుడు చేపట్టిన సర్పయాగం వలన యాగంలో అన్ని పాములు పడి చనిపోతుంటాయి. సర్పరాజు తపస్సు చేసి ఇంద్రుడుని ప్రార్థిస్తాడు. దానితో ఇంద్రుడు ఆ యాగాన్ని ఆపించి, సర్పజాతికి విముక్తి కలిగిస్తాడు. అందుకే ఆ రోజు భక్తులు ఆనందంతో పుట్టలో పాలు సమర్పిస్తారు. క్షీరాబ్ధి ద్వాదశి నాడు సాయంత్రం ఇంటిలోని తులసి మొక్క దగ్గర ఉసిరి (ధాత్రి) మొక్కను ఉంచి విష్ణుమూర్తికి పూజలు చేస్తారు. 12,16,21 దీపాలను వెలిగించి మహిళలు పూజలు చేస్తారు. వీటినే ద్వాదశిదీపాలు అంటారు ఆ రోజు ప్రతీ ఇంట దీపాలను వెలిగిస్తారు.

కార్తీకపౌర్ణమి, పోలిస్వర్గం కార్తీక మాసం..

కృత్తిక నక్షత్రంలో వచ్చే పౌర్ణమిని కార్తీక పౌర్ణమి అంటారు. ఈ రోజు ఉపవాసం ఉంటే శివరాత్రి రోజున ఉపవాసం ఉన్నంత ఫలితం వస్తుందట. ఉదయం నుంచి ఉపవాసం ఉండి కార్తీక దామోదరున్ని పూజించి 365 ఒత్తులను వెలిగించి చంద్రుడు కనిపించిన తర్వాత ఉపవాస విరమణ చేస్తారు. మరికొన్ని గృహాల్లో కొత్తగా పెళ్లయిన అమ్మాయిలతో 33 పున్నమి నోములు చేయిస్తారు. ఆ రోజు సాయంత్రం శివాలయంలో అమ్మవారికి గుమ్మడికాయ, కంద, పసుపు మొక్క, స్వయం పాకం ఇప్పిస్తారు. పోలి స్వర్గం కార్తీక మాసం ఆఖరిరోజు అమావాస్య వెళ్లిన మరుసటి రోజు పోలిస్వర్గం పూజలు చేస్తారు. దీనికి సంబంధించిన కథను పురోహితుల ద్వారా విని వారికి స్వయంపాకలు ఇచ్చి ఆరటి డిప్పలో దీపాలు పెట్టి కాల్వలో గానీ, చెరువులో గానీ వదులుతారు. దీంతో కార్తీకమాసం పరిసమాప్తం అవుతుంది.

క్రైం కార్నర్

వివాహిత అదృశ్యం

నర్సింహులపేట, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : వివాహితతో పాటు ఇద్దరు చిన్నారులు ఆదృశ్యమైన సంఘటన బుధవారం పడమటిగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. పడమటిగూడెంకి చెందిన హెచ్. యాకయ్యతో మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన స్వప్నతో పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వారు కొంతకాలంగా హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డారు. దసరా పండుగకు భర్త యాకయ్యతో పాటు భార్య స్వప్న కుమార్తెలు దీక్ష, నిఖితలు పడమటిగూడెంకు వచ్చారు. పండుగ పూర్తయిన తర్వాత భార్యాభర్తల మధ్య చిన్న ఘర్షణ చోటు చేసుకుంది. మరుసటిరోజు యాకయ్య హైదరాబాద్‌కు వెళ్లి పోయాడు. ఈనెల 16న స్వప్న తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరింది. ఇప్పటి వరకు భర్త వద్దకు చేరకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యాడు. బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్వప్న సోదరి మనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



అదృశ్యమైన స్వప్న, చిన్నారులు

రైతులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

కురవి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులను ధాన్యం కొనుగోలు పేరుతో మోసం చేస్తూ రూ.26 లక్షలను రైతులకు ఎగ్గొట్టి రెండేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న బాదావత్ శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. పోలంపల్లి తండాకు చెందిన బాదావత్ శంకర్ 2022లో ధాన్యం కొనుగోలు చేస్తానని రైతులను నమ్మించి సుమారు 50 మంది రైతుల వద్ద ధాన్యాన్ని సేకరించాడు. ఆ ధాన్యాన్ని విక్రయించి రైతులకు రూ.26 లక్షలు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ విషయమై 2022లో చౌపుల్లతండాకు చెందిన భట్టు లచ్చు ఫిర్యాదు మేరకు కురవి పోలీస్‌స్టేషన్‌లో శంకర్‌పై ఛీటింగ్ కేసు నమోదైంది. అప్పట్నుంచి భార్యబిడ్డలతో శంకర్ ఇతర రాష్ట్రాలలో తలదాచుకుంటున్నాడు. శంకర్‌పై నిఘా పెట్టిన కురవి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని, ట్రాలీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శంకర్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. రెండేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న శంకర్‌ను అరెస్టు చేయడం పట్ల బాధిత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శంకర్‌ను పట్టుకున్న కురవి ఎస్సై సతీష్‌ను డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య అభినందించారు.



పోలీసులు అరెస్టు చేసిన బాదావత్ శంకర్

సంక్షిప్త వార్తలు

మానుకోటలో భారీగా పూలు కొనుగోళ్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో మహిళలు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పూలు, ప్రమిదలు కొనుగోళ్లు చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో పూల తోటలు వేసిన రైతులు ఆటోల్లో తీసుకువచ్చి విక్రయించగా, పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు కొనుగోల్లు చేసి పట్టణంలో అమ్మకాలు జరిపారు. కాగా, గత ఏడాది కంటే ఎక్కువ కొనుగోళ్లు జరిపినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. బంతిపూలు కిలో ఒక్కంటికి రూ. 50 కాగా, పూలు మాలకట్టి మూరెడు పూలకు రూ.25 చొప్పున అమ్మకాలు జరిపారు. దీపాలు పెట్టే ప్రమిదలు సైజును బట్టి రూ. 10కి నాలుగు, ఆరు చొప్పున అమ్మకాలు జరిపారు.

మద్యం తాగి వాహనాలు నడుపవద్దు

• గూడూరు సీఐ బాబురావు

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారికి జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందని సీఐ బాబురావు హెచ్చరించారు. గూడూరులోని మహబూబాబాద్-నర్సంపేట జాతీయరహదారిపై బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేసి మద్యం తాగిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలను అందుబాటులోఉంచుకోవాలన్నారు. ఆయన వెంట గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న బాబురావు

సబ్‌స్టేషన్ స్థలాన్ని మార్చాలి

కేసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని వెంటనే మార్చాలని కోరుతూ కలెక్టరేట్, విద్యుత్ ఎస్ఈ, స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు కేసముద్రం విలేజి చైతన్యనగర్‌కాలనీ వాసులు బుధవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు కొమ్ము రాహుల్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ స్థలం భవిష్యత్తులో ఇతర ఆఫీస్‌లను నిర్మించేందుకు ఉపయోగపడుతుందని, గ్రామపరిధిలో మరోచోట ప్రభుత్వ స్థలం ఉందని అందులో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వల్లందాస్ రవి, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందుల సంజీవ, పొలెపాక శంకర్, కొమ్ము రామకృష్ణ, బిర్రు సాంబయ్య, మురళి, శ్రీను, నవీన్, ప్రేమ్, సతీష్, యాకయ్య, నాగయ్య, భరత్, కళ్యాణ్ పాల్గొన్నారు.

'అతిథి అధ్యాపకుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా వాటిల్లో 19 మంది అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 5నెలలుగా వేతనాలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర మంత్రులు మల్లు భట్టివిక్రమార్కచ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క, కొండ సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు గాంధీభవన్‌లో వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. అధ్యాపకులు ధర్మారపు సదాకర్, రాంప్రసాద్, నిమ్మల ప్రేమ్, శేఖర్, నాగేశ్వర్‌రావు, సృజన, మేరి పాల్గొన్నారు.

ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సయ్య

గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన పానుగంటి నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో పానుగంటి నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సయ్య 1979లో సీపీఎం పార్టీలో చేరి 1984లో ఓంకార్ ఏర్పాటు చేసిన ఎంసీపీఐ పార్టీలో చేరారు. నర్సంపేట డివిజన్ కార్యదర్శి, గూడూరు తాలుకా కార్యదర్శిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా, జిల్లా కార్యదర్శిగా, యూవైఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేశారు. గూడూరు వ్యవసాయ కార్మిక రైతాంగ, విద్యార్థి, యువజన సంఘాల పోరాటాల్లో పాల్గొన్నారు. పోడు భూములు, ప్రభుత్వ ఇండ్లు, 30 పడకల ఆస్పత్రి కోసం పానుగంటి కృషి చేసినట్లు చెప్పారు. తనపై నమ్మకంతో ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు ఆ సంఘం రాష్ట్ర, జాతీయ కార్యవర్గ సభ్యులకు నర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు.



న్యూస్ బాక్స్

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

బయ్యారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం బయ్యారంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 19 లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు మంజూరు కాగా, ఎమ్మెల్యే చేతుల మీదిగా వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీవో కార్యాలయం సూపరిండెంట్ దైవాదినంతో పాటు కాంగ్రెస్ నేతలు, లబ్దిదారులు, ప్రజలు పాల్గొన్నారు. అంతకుముందు బయ్యారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షించాలి'

కురవి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళికి కాల్చే టపాసుల వల్ల పర్యావరణం కాలుష్యమవుతుందని పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కురవి నాగార్జున విద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హెచ్‌ఎం భూక్య రవి మాట్లాడారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు కవిత, ప్రదీప్, విజయ్, నాగమణి, త్రివేణి, రాగిణి, ఫర్హాన, అనూష, స్వరూప, రమ్య, సునీత, సంధ్యారాణి, పారిజాతం, జ్యోతి, అంజు, శివకుమార్ పాల్గొన్నారు.

డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా వెంకటస్వామి

డోర్నకల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ నూతన కమిషనర్‌గా ఎస్.వెంకటస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన నరేష్‌రెడ్డి మరిపెడ మునిసిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మరిపెడ మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామి డోర్నకల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. అనంతరం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటస్వామికి మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



5, 6 తేదీల్లో గిరిజన సమ్మేళనం

నెహ్రూసెంటర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 5,6 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రం వేదికగా గిరిజన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్‌హెచ్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ధర్మానాయక్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధర్మానాయక్ గిరిజనుల కోసం, పోడు భూముల రక్షణకై పోరాటాలు నిర్వహించారని, ఆయన ఆశయసాధన కోసం కృషి చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే గిరిజన సమ్మేళనానికి గిరిజనులు మహబూబాబాద్ జిల్లా నుంచి భారీగా తరలిరావాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ధర్మానాయక్ కుమార్తె, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకురాలు విజయభాయి నేతృత్వంలో జరిగే కార్యక్రమానికి గిరిజనులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాందాస్‌నాయక్, శివవర్మ, కొప్పుల కిరణ్, బాలునాయక్ పాల్గొన్నారు.

నున్నానారాయణనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 4వవార్డు పరిధిలోని నున్నానారాయణనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ నోముల రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ నున్నానారాయణ నగర్ కాలనీ సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని, మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యం పేరుకు పోయిదోమలు స్వైరవిహారం చేస్తున్నాయని చెప్పారు. నిర్లక్ష్యాన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీ. రజాక్, సైదులు, దేవేందర్, మధు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

• జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని, విధుల్లో ఉన్నప్పుడే నిబద్ధతతో పనిచేస్తే ప్రజల నుంచి మంచి గుర్తింపు ఉంటుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నరహరి పదవీవిరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో నరహరి దంపతులను ఎస్పీ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఏఆర్ డీఎస్పీ విజయ్‌ప్రతాప్, ఆర్ఐలు అనిల్,నాగేశ్వర్‌రావు, ఆర్ఎస్సైలు పుల్లారావు, శేఖర్, సునంద, మౌనిక, నరహరి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే సన్నబియ్యమంటూ మోసం

డోర్నకల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కొందరు యువకులు తక్కువ ధరకే సన్నబియ్యం అంటూ ప్రజలను మోసం చేస్తున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం. కొందరు యువకులు ద్విచక్రవాహనాలపై తిరుగుతూ తమ వ్యవసాయ క్షేత్రంలో పండించిన సన్నధాన్యంను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు నమ్మిస్తున్నారు. బస్తాలలో పైన సన్నబియ్యం ఉంచి కిందభాగంలో రేషన్ బియ్యం పెట్టి విక్రయిస్తూ మోసం చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. మునిసిపల్ పరిధిలోని కుందోజు వారి వీధికి చెందిన రామాచారిని అలాగే బురిడి కొట్టించి, అతనికి క్వింటా బియ్యం విక్రయించినట్లు చెప్పారు. యువకులు వెళ్లిన కొద్దిసేపటికి ఆ బియ్యం పరిశీలించిన రామాచారి అవాక్కైయి.. తాను మోసపోయినట్లుగా బావించి తన లాగా ఎవరు మోసపోవద్దని సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. సమీప గ్రామాల్లో కూడా ఈ విధంగానే జరిగినట్లు కొందరు తన దృష్టికి తీసుకువచ్చారని రామాచారి తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

గార్ల అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సంబంధించిన పెండింగ్ వేతనాలు తక్షణం విడుదల చేసి అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.- గురువారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను అందించాలని కోరుతూ బుధవారం గార్లలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేసి గౌరవ వేతనం పెంచాలన్నారు. అప్పిరెడ్డి, దాసు, శ్రీను, పాల్గొన్నారు.

సర్వేను విజయవంతంగా నిర్వహించాలి

పెద్దవంగర, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నవంబర్ 6నుంచి చేపట్టే సమగ్ర కుటుంబ సర్వేపై ఆయా శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పీఆర్ఏఈ దయాకర్, మిషన్ భగీరథ ఏఈ యాకుమ్ పాషా, విద్యుత్‌శాఖ ఏఈ రమేష్, ఆర్ఐ లష్కర్, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'టీచర్లు సమయపాలన పాటించాలి'

తొర్రూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పాఠశాలల్లో హాజరుశాతాన్నిపెంచాలని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. బుధవారం తొర్రూరులోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని, వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మల్లేష్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఛాంబర్ అభివృద్ధికి సహకరిస్తాం

• పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఛాంబర్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు వ్యాపారుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందిన మచ్చ సురేష్ కార్యవర్గం బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గెలుపొందిన సురేష్‌ను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి శాలువా మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాంబర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉంటామని, వ్యాపారులు మరింత అభివృద్ధి చెందాలన్నారు. పట్టణ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చిదిరాల శ్రీనివాస్, తల్లాడ హీరాదర్, మచ్చ లక్ష్మయ్య, తోట శ్రీనివాస్, ఎన్. శ్రీను, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మరిపెడ మునిసిపల్ కమిషనర్‌గా నరేశ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

మరిపెడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ కమిషనర్‌గా కె.నరేశ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ వెంకటస్వామి డోర్నకల్ మునిసిపాలిటీకి బదిలీ కాగా, అక్కడి కమిషనర్ మరిపెడ మునిసిపాలిటీకి బదిలీపై వచ్చారు. కమిషనర్‌ను మునిసిపల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు.

